సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం ‌। 26 । ఏప్రిల్ । 2025



ఎనిమిది మంది స్మగ్లర్లు అరెస్టు

వీరబల్లి అటవీ పరిధిలో 8 మంది ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి వారి నుంచి 12 ఎర్రచందనం దుంగలు,బైక్ ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. -10లో



రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు

ఆంధ్ర ప్రదేశ్‌లో రెడ్ బుక్ రాజ్యాంగం అమలుచేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. -10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.90	రూ.110
రెండోరకం	రూ.60	రూ.80



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 434 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
సీబీ	500	530
బైవోల్టిన్	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 71.460 కిలోలు

న్యూస్‌రీల్

26 నుంచి షూటింగ్‌బాల్ పోటీలు

మదనపల్లె సిటీ: మదనపల్లె వశిష్ట పాఠశాలలో 26 వతేదీ నుంచి 27వతేదీ వరకు 8వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ -బాల,బాలికల షూటింగ్‌బాల్ పోటీలు జరగనున్నాయి. ఈ విషయాన్ని రాయలసీమ జిల్లాల షూటింగ్‌బాల్ అసోసియేషన్ కన్వీనర్ నరేష్ తెలిపారు. ఈ పోటీలు 26న ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు.

వెబ్‌సైట్‌లో సీనియారిటీ జాబితా

కడప ఎడ్యుకేషన్: రాయలసీమ జోన్ -4 పరిధిలోని అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు పూర్వపు జిల్లాలోని స్కూల్ అసిస్టెంట్(గవర్నమెంట్) నుంచి గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయ పోస్టులకు(గవర్నమెంట్) సీనియారిటీ జాబితాను వెబ్‌సైట్ https://rjdsekadapa.blogpot.comలో ఉంచినట్లు పాఠశాల విద్య ఆర్‌జేడీ కాగిత శామ్యూల్ తెలిపారు. కావున ఉపాధ్యాయులు ఈ జాబితాను పరిశీలించాలని ఆయన పేర్కొన్నారు. దీనిని జిల్లా విద్యాశాఖ అధికారులు వారి వెబ్‌సైట్‌లో ప్రకటించాలని సూచించారు.

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న డీఆర్‌వో మధుసూధన్‌రావు

రాయచోటి టౌన్: ఈ నెల 30వ తేదీ నిర్వహించే పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని డీఆర్ఓ కె.మధుసూధన్ రావు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతుడూ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేయాలని పోలీసులకు,విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు.పరీక్ష సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.

పక్కా గృహాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోండి



గ్రామస్తులతో మాట్లాడుతున్న పీడీ సాంబశివయ్య

రామాపురం: పక్కా గృహాల కోసం అర్హులైన లబ్ధిదారులు గ్రామ సచివాలయంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ పీడీ సాంబశివయ్య పేర్కొన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లె బీసీకాలనీ, కుమ్మరపల్లె గ్రామాలలో శుక్రవారం నిర్మాణ దశలో ఉన్న పక్కాగృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కుమ్మరపల్లె గ్రామంలో పూరి ఇంటిలో నివాసం ఉన్న ప్రజలతో మాట్లాడుతూ గ్రామాల్లో గతంలో మంజూరైన గృహాల్లో నిర్మించుకోలేకపోయినా ఎస్టీ లబ్ధిదారులకు రూ75వేలు, ఎస్సీ బీసీ లబ్ధిదారులకు రూ50వేలు అదనంగా ప్రభుత్వం అందజేస్తోందన్నారు. త్వరగా ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలని తెలియజేశారు. మండల హౌసింగ్ ఏఈ ఎల్‌వి ప్రసాద్, సచివాలయం అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

పరిసరాలశుభ్రతతోనే వ్యాధులు దూరం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది

రాయచోటి అర్బన్: పరిసరాల శుభ్రతతోనే వ్యాధులు దరిచేరవని జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి అన్నారు.శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య,ఆరోగ్యశాఖ ఉద్యోగులు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నుంచి నేతాజీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాను మలేరియా రహితంగా తీర్చిదిద్దేందుకు అందరూ కృషి చేయాలని తెలిపారు. మురుగునీరు ఇంటి పరిసరాల్లో నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా ఈగలు,దోమలు వృద్ధి చెందకుండా చర్యలు చేపట్టాలన్నారు. 2027 నాటికి జీరో మలేరియాను, 2030 నాటికి మలేరియా నిర్మూలనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు కిరణ్‌కుమార్, శివ రామరాజు, మలేరియా సబ్ యూనిట్ అధికారి జయరామయ్య, శ్రీనివాసుల రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ బలరామరాజు, ల్యాబ్ టెక్నీషియన్‌లు నాయక్, వెంకట్రామిరెడ్డి, ఉత్తమ్ రెడ్డి, శ్రీనాథరెడ్డి, సూపర్‌వైజర్‌లు వెంకటేశ్వర్ రెడ్డి, నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

అబద్ధపు కేసులు..ఆపై వేధింపులు

- మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో ఫైళ్లు కాలిన కేసులో అరెస్టులు ప్రభుత్వ వేధింపులే
- గౌతంతేజ్ పాలీగ్రాఫ్ పరీక్షలో అది ప్రమాదమే అని తేలినా
- న్యాయస్థానం ఉత్తర్వు, నివేదికలు తేల్చినా మాజీ మంత్రి పెద్దిరెడ్డి అనుచరుడనే మాధవరెడ్డి అరెస్ట్



కాలిపోయిన మదనపల్లె ఆర్డీవో కార్యాలయం (ఫైల్)

బి.కొత్తకోట: రాష్ట్రంలో రెడ్‌బుక్ డైరెక్షన్‌లో ప్రతిపక్షంపై కూటమి ప్రభుత్వం వేధింపుల పర్వం కొనసాగిస్తోంది. అన్నమయ్య జిల్లా మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో గత ఏడాది జూలై 21న జరిగిన అగ్నిప్రమాద ఘటనలో కుట్ర కోణం లేదని స్పష్టమైనప్పటికీ ప్రభుత్వం పదేపదే ఈ కేసును రాజకీయ అస్త్రంగా వాడుకొంటూ ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నేతలను వెంటాడుతోంది. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని అనుచరులపై కేసులు నమోదు చేశారు. ఈ కేసులో తాజాగా మాధవరెడ్డిని సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారు. పాలీగ్రాఫ్ పరీక్షలో అగ్నిప్రమాదం చేసింది కాదని తేలినా, బెయిల్ ఉత్తర్వులో న్యాయస్థానం పేర్కొన్న అంశాలను పట్టించుకోకుండా అరెస్టులతో వేధిస్తున్నారు.

ఆధారాలు లేకున్నా అరెస్టులు

ఆర్డీవో కార్యాలయ కేసు అక్కడ పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్ గౌతం తేజ్ కీలకంగా దర్యాప్తు సాగింది. ఈ కేసులో కుట్ర కోణం ఆధారాల కోసం సీఐడీ అధికారులు రోజుల తరబడి విచారణ జరిపారు. పదులసంఖ్యలో వ్యక్తులను విచారించారు. కేసులో నమోదైన నిందితుల్లో గౌతంతేజ్ మొదటి నిందితునిగా పేర్కొన్న పోలీసులు కుట్రకోణంపై కచ్చిత ఆధారాల కోసం పాలీగ్రాఫ్ పరీక్షలు చేయించారు. గతేడాది నవంబర్ 26, 27న ఏపీఎఫ్ఎస్ఎల్ అధికారులు గౌతంతేజ్‌కు పాలీగ్రాఫ్ పరీక్షలు చేశారు. సాంకేతికంగా ఆధారా లతో కేసును ముందుకు తీసుకెళ్లాలని ఆశించిన ప్రభుత్వ పెద్దలకు వెల్లడైన నిజం మింగుడుపడలేదు. గౌతంతేజ్‌కు అడిగిన నాలుగు ప్రశ్నలతో సమాధానాలు రాబడితే అందులో ఒక్క ప్రశ్నకు కూడా అవుననే సమాధానం లేదు. అన్నింటికి కాదు అని సమాధానాలు రావడంతో ఈ కేసులో బలం లేదని స్పష్టమైప్పటికి వేధింపులు ఆపకుండా కొనసాగిస్తున్నారు.



న్యాయస్థానం చెప్పినా..

మదనపల్లె ఆర్డీవో కార్యాలయ ప్రమాద సమయం ఆరోజు రాత్రి 11.25 గంటలకు మంటలు వ్యాపించాక కాపలాదారు రమణయ్య వాటిని ఆర్పేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. డిప్యూటీ తహసీల్దార్ తపస్వినికి సమాచారం ఇచ్చినట్టు నిర్ధారించారు. న్యాయస్థానం ఇచ్చిన బెయిల్ ఉత్తర్వులో ప్రధాన నిందితుడు సీనియర్ అసిస్టెంట్ గౌతం తేజ్ రాత్రి 10.40 గంటలకు కార్యాలయం నుంచి బయటకు వచ్చినట్టు ప్రాసిక్యూషన్ సమర్పించిన సీసీ కెమెరా ఫుటేజీల్లో రికార్డు అయినట్టు ఉత్తర్వులో పేర్కొంది. ప్రమాద సమయంలో గౌతంతేజ్ కార్యాలయంలో లేదని స్పష్టమైంది. గౌతంతేజ్ వాంగ్మూలం తప్ప ఇతర ఆధారాలు లేవని, ఒకవేళ ఆధారాలుంటే కేసు విచారణలో పరిగణలోకి తీసుకోవచ్చు అని న్యాయస్థానం గౌతంకు ఇచ్చిన బెయిలు తీర్పులో స్పష్టంగా పేర్కొంది. దీంతో ఈ కేసులో ఆధారాలు లేవని తెలుస్తుండగా నిందితులుగా పేర్కొన్న వారిని వేధించాలన్న లక్ష్యంతో ఉన్నట్టు తెలుస్తోంది.

ఇంకా అరెస్టులు

ఫైళ్లు కాలిపోయిన కేసులో మరికొందరిని అరెస్ట్ చేస్తారంటూ సీఐడీ అధికారులు లీకులు ఇస్తున్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులపై పలు కేసులు నమోదు చేశారు. ఈ కేసులకు సంబంధించి ఇప్పటివరకు ఫైళ్లు కాలిపోయిన కేసులో గౌతంతేజ్‌ను అరెస్ట్ చేయగా ఇప్పుడు మాధవరెడ్డిని అరెస్ట్ చేశారు. మిగిలిన వారిలో నలుగురిని అరెస్ట్ చేస్తామని అధికారులు అంటున్నారు. దీన్ని బట్టి చూస్తే వైఎస్సార్‌సీపీకి అండగా, బలంగా నిలబడిన నాయకులను లక్ష్యంగా చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా, మున్సిపల్‌వైస్ చైర్మన్ జింకా చలపతి ఇలా పలువురిపైనా కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో ఇంకో నలుగురైదుగురిని అరెస్ట్ చేస్తారని ప్రచారం జరుగుతోంది.

ఫైళ్లు కాలిపోవడంపై నమోదైన కేసులో మదనపల్లెకు చెందిన మాధవరెడ్డిని నిందితునిగా చేర్చారు. ఆ తర్వాత ఆయన ఇంటిలో పోలీసు అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో అధికారులు స్వాధీనం చేసుకున్నవన్నీ డాక్యుమెంట్లకు సంబంధించిన జిరాక్స్ కాపీలే ఉన్నాయి. ఈ కాపీలు వందలసంఖ్యలో ఉన్నప్పటికి లెక్కకట్టి వాటినే స్వాధీనం చేసుకోగా, వాటిలో ఒరిజనల్ డాక్యుమెంట్లు ఒకటి కూడా లభ్యంకాలేదని తెలిసింది. మాధవరెడ్డి రియల్‌ఎస్టేట్ వ్యాపారిగా భూముల క్రయవిక్రయాలు సాగిస్తుంటారు. ఇందులో భాగంగా ఇంటిలో ఉంచుకున్న వాటి జిరాక్స్ కాపీలనే దర్యాప్తు అధికారులు స్వాధీనం చేసుకోన్నట్టు తెలుస్తోంది. అయితే ఇందులో కేసుకు సంబంధించిన ఆధారాలు లేవని తెలిసింది. ఇదేవిధంగా మిగిలిన వారి ఇళ్లలోనూ సోదాలు నిర్వహించిన పోలీసు బృందాలు దొరికిన వాటిని స్వాధీనం చేసుకున్నాయి. మాధవరెడ్డి రియల్‌ఎస్టేట్ వ్యాపారిగా భూములకు సంబంధించి ల్యాండ్ కన్వర్షన్ లేదా వాటి సమస్యలపై రెవెన్యూ అధికారులను కలవడం అనేది సాధారణ విషయం. అయితే దీన్నే పెద్దఅంశంగా చేసి కేసులతో అరెస్ట్ చేశారు.



మాధవరెడ్డి (ఫైల్)

నూతన నియామకం



బండ్రేవు వెంకట నారాయణరెడ్డి



బయనబోయిన గోపినాథ్

రాయచోటి/రాజంపేట: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా జిల్లాకు చెందిన ముగ్గురికి అవకాశం కల్పించారు. ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. జిల్లా నుంచి బండ్రేవు వెంకట నారాయణ రెడ్డి, రావుల నరసింహారెడ్డి, బయనబోయిన గోపినాథ్‌లకు అవకాశం కల్పించారు. పార్టీకి విశిష్ట సేవలు అందించిన వారికి గుర్తింపుగా ఈ పదవులు కేటాయించారు.

రాష్ట్ర అనుబంధ విభాగాల్లో...

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లాకు చెందిన పలువురిని రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర మేధావుల ఫోరం అధికార ప్రతినిధిగా పాలెం రఘునాథరెడ్డి, రాష్ట్ర విద్యార్థి విభాగం సంయుక్త కార్యదర్శిగా ఎస్‌కే జుబేర్, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శులుగా ఏకుల రాజేశ్వరి, జానం రాధ, రాష్ట్ర ప్రచార విభాగం ప్రధాన కార్యదర్శిగా కె.సుబ్బరామిరెడ్డి, స్టేట్ గ్రీవెన్స్‌సెల్ ప్రధాన కార్యదర్శిగా బి.శివశంకర్‌రెడ్డిలను నియమించారు.

లోక్‌అదాలత్ వాయిదా

కడప అర్బన్: రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశానుసారంగా 'జాతీయ లోక్ అదాలత్' షెడ్యూల్ ప్రకారం మే 10న (రెండవ శనివారం) జరగాల్సి ఉండగా.. జూలై 5 (మొదటి శనివారం)వ తేదీకి వాయిదా పడింది. ఈ సమాచారాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, ఎస్.బాబా ఫక్రుద్దీన్ శుక్రవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని కక్షిదారులు, వివిధ శాఖల అధికారులు గమనించాలని వారు కోరారు.

గుక్కెడు నీళ్లు..గుప్పెడు గింజలు



వాటర్‌బౌల్‌లో నీటిని నింపుతున్న హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు



దాహార్తి తీర్చుకుంటున్న కోతులు

వాటర్ బౌల్ పేరుతో వినూత్న ఆలోచన

మదనపల్లె సిటీ: ఈసారి ఎండలు ఆరంభం నుంచే అదరగొడుతున్నాయి. ఉష్ణతాపం తీవ్రమవుతుండటంతో జంతుజాలం దాహంతో అల్లాడుతోంది. మనుషులైతే దప్పిక వేసినపుడు ఎలాగోలా గొంతు తడుపుకొంటారు. కానీ మూగజీవాలకు ఇబ్బందిగా ఉంటుంది. మరి మూగజీవాల పరిస్థితి ఏమిటి? చుక్క నీటి కోసం మైళ్ల దూరం ప్రయాణిస్తూ ప్రాణాలు కోల్పోతున్నాయి. పక్షి జాతుల్లో కొన్ని అంతరించిపోవడానికి వేసవి ఒక కారణమని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మనం ఏమి చేయాలేమా? అని హెల్పింగ్ మైండ్స్ సంస్థ, గణపతిసచ్చిదానంద స్వామి ఆశ్రమ నిర్వాహకులకు కలిగిన ఆలోచన మదనపల్లె పరిసర ప్రాంతాల్లో వేలాది పశుపక్షాదుల దాహార్తిని తీరుస్తోంది.

- సాధారణంగా పక్షుల శరీర సాధారణ ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్. ఈ ఉష్ణోగ్రత దాటితే ఎక్కువ సేపు జీవించలేవు. అందుకే చాలా పక్షులు ఎక్కడ నీరు కనిపిస్తే అందులో మునకేస్తూ శరీర ఉష్ణోగ్రతను తగ్గించుకుంటాయి. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో పక్షుల రక్షణకు నడుం బిగించింది హెల్పింగ్‌మైండ్స్, సచ్చిదానంద ఆశ్రమం నిర్వాహకులు. సేవేమార్గంగా వాటర్‌బౌల్ ప్రాజెక్టును ప్రారంభించారు.అలాగే ధాన్యం గింజలతో పాటు పండ్లు కూడా అక్కడక్కడ ఉంచుతున్నారు.

వాటర్‌బౌల్స్ వితరణ

స్థానిక బొమ్మనచెరువువద్దనున్న గణపతి సచ్చిదానందస్వామి గత నాలుగేళ్లుగా ఆశ్రమ నిర్వాహకులు భక్తులకు వాటర్‌బౌల్స్‌ను ఉచితంగా అందజేస్తున్నారు. బౌల్స్‌లో మంచి నీళ్లు నింపి ఇంటి ముందు, పరిసర ప్రాంతాల్లో పక్షులకు అందుబాటులో ఉంచాలని సూచిస్తున్నారు. దీంతో పట్టణంలో పలు ప్రాంతాల్లో వేసవిలో ఈ కార్యక్రమంకు శ్రీకారం చుట్టారు.

25 తొట్టెలతో ప్రారంభమై...

పక్షులను వేసవి తాపం నుంచి రక్షించి వాటి దాహార్తి తీర్చే ఉద్దేశంతో 2018లో వాటర్‌బౌల్ పేరుతో మదనపల్లెకు చెందిన హెల్పింగ్‌మైండ్స్ సంస్థ సామాజిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తొలి ఏడాది నుంచి సభ్యులు, దాతల సహకారంతో మదనపల్లె-బెంగుళూరు రోడ్డు, కురబలకోట మండలం రైల్వేస్టేషన్‌వద్దనున్న ఫారెస్టు రోడ్డు ప్రాంతాల్లో వాటర్‌బౌల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది సుమారు100కు పైగా తొట్టెలను ఏర్పాటు చేశారు. వీటిలో ట్యాంకర్ల సాయంతో నీరు నింపుతున్నారు. ఫారెస్టులోని నెమళ్లు, దుప్పిలు, జింకలు, పావురాలు, కోయిలలు, కోతులు, కుక్కలు,కాకులు వాటర్‌బౌల్స్ వద్దకు వచ్చి దాహార్తి తీర్చుకుంటున్నాయి. ఈ వాటర్‌బౌల్స్ వద్దకు పక్షులు, మూగజీవాలు వచ్చి నీటిని తాగుతుండటం చూసి ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తాము ఈ వాటర్‌బౌల్ ప్రాజెక్టులో భాగస్వాములమవుతామని ముందుకు వస్తున్నారు.

ఉచితంగా అందిస్తాం



వేసవి వస్తే మనుషుల కోసం అడుగడుగునా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. కానీ మూగజీవాల గురించి ఎవ్వరూ పట్టించుకోవట్లేదు. అందుకే మా సంస్థ వాటర్‌బౌల్ ప్రాజెక్టు ప్రారంభించాం. మదనపల్లె సమీప ప్రాంతాల్లో ఏర్పాటు చేశాం. మూగజీవాలను ప్రేమించేవారు ఎవ్వరు వచ్చినా ఉచితంగా తొట్టెలను అందిస్తాం. -అబుబకర్‌సిద్దిక్, హెల్పింగ్‌మైండ్స్ సంస్థ వ్యవస్థాపకులు,మదనపల్లె.

ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించాలి

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

పెద్దమండ్యం: గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నారు. పెద్దమండ్యంలో డంపింగ్ యార్డ్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. రోజువారీగా చెత్త సేకరణపై పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. అలాగే యాప్‌లో రోజువారీగా చెత్త సేకరణ వివరాలను అప్‌లోడ్ చేస్తున్నారా లేదా అనే విషయమై ఆరా తీశారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శాఖలవారీగా అధికారులతో సమీక్షించారు. గ్రామాల్లో ఉన్న డంపింగ్ యార్డ్‌లను వినియోగంలోకి తీసుకురావాలని గ్రామ కార్యదర్శులను ఆదేశించారు. సకాలంలో ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు. పక్కాగృహాల నిర్మాణంపై సమీక్షించారు. కాలనీలలో గృహ నిర్మాణాల పురోగతిపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యాలయం వద్ద ప్రజలు, ప్రజా ప్రతినిధులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆకుమానిగుట్ట నిర్మాణంతో భూములు కోల్పోయిన రైతులకు భూ పరిహారం, అర్ధంతరంగా ఆగిపోయిన నల్లరాతిమడుగు ప్రాజెక్టు నిర్మాణం పనుల గురించి ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక కలెక్టర్‌కు వివరించారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించారు.పీహెచ్‌సీలో జరుగుతున్న ప్రసవాల గురించి ఆరా తీశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సయ్యద్‌అహ్మద్, ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖర రెడ్డి, ఏపీడీ నందకుమార్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అశోక్‌కుమార్, హౌసింగ్ ఏఈ అక్రమ్, ట్రాన్స్‌కో ఏఈ రామ్మూర్తినాయక్ తదితరులు పాల్గొన్నారు.



డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి

సారా రహిత జిల్లాగా మారుద్దాం

రాయచోటి టౌన్: జిల్లాను సారా రహితంగా మార్చేందుకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రొహిబిష, ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో నవోదయ- 2- కార్యక్రమంలో భాగంగా జిల్లాను నాటు సారా రహితంగా మార్చేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశాలపై చర్చించారు. జిల్లాలో వాయల్పాడు, మదనపల్లె, మొలకల చెరువు, పీలేరు నాటుసారా ప్రభావిత ప్రాంతాలని, వీటిని నాటుసారా రహితంగా చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఆయా ప్రాంతాల్లో పాత నేరస్తులను గుర్తించి బైండోవర్ చేయాలని చెప్పారు. సారా తయారీ ప్రదేశాలను గుర్తించేందుకు డ్రోన్ కెమెరాలను ఉపయోగించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి మధుసూధన్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జోగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్నఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్

ఉగ్రదాడి మృతులకు నివాళి



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న అన్నమాచార్య యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు

జమ్ముకాశ్మీర్‌లోని పహెల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి అన్నమాచార్య యూనివర్సిటీ అధ్యాపకులు,విద్యార్థులు శుక్రవారం రాత్రి నివాళులు అర్పించారు. ఉగ్రదాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ కొవ్వొత్తుల ర్యాలీ వల్ల విద్యార్థులలో దేశభక్తి, సామాజికబాధ్యత పెంపొందించవచ్చని తెలిపారు. బాధిత కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తూ, భగవంతుడు వారికి మనోధైర్యం ప్రసాదించాలని అందరూ ప్రార్థించారు.కార్యక్రమంలో వీసీ డాక్టర్ సాయిబాబారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ మల్లికార్జునరావు, ఏఐటీఎస్ ప్రిన్సిపాల్ డా.నారాయణ, పరిపాలనాధికారి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. -రాజంపేట

క్లుప్తంగా

వ్యాన్ బోల్తా.... ఒకరు మృతి

రాజంపేట : మండలంలోని రోళ్లమడుగు సమీపంలో గొర్రెలను తరలిస్తున్న మినీ లారీ శుక్రవారం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రెడ్డిచర్ల చిన్నప్ప (50) మృతి చెందారు. చిన్నప్ప శుక్రవారం నెల్లూరు జిల్లా గూడూరు నుంచి గొర్రెలను కొనుగోలు చేసి సానిపాయిలోని గృహానికి తీసుకువస్తున్నారు. రోళ్ల మడుగు వద్ద వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో చిన్నప్ప మృతిచెందారు. ఈ మేరకు మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు మృతి


జ్ఞానేంద్రప్రసాద్(ఫైల్)

కలికిరి : అల్లారు ముద్దుగా పెంచుకున్న కుమారుడు తమను ఆరాధిస్తాడని భావించిన తల్లిదండ్రులకు తీరని శోకం మిగిలింది. రోడ్డు ప్రమాదం రూపంలో ఒక్కగానొక్క కుమారుడు శుక్రవారం ప్రాణాలు విడిచారు. పోలీసుల వివరాల మేరకు.. ఈ నెల 14న మదనపల్లి నుంచి కలికిరి పట్టణానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కాకర్ల జ్ఞానేంద్ర(26) వస్తున్నారు. మదనపల్లి–తిరుపతి జాతీయ రహదారిపై చింతలవారిపల్లి బస్టాపు సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు విలపించడం స్థానికులను కలచివేసింది. మృతుడికి సుమారు ఏడాది కిందట వివాహమైంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆరుగురికి గాయాలు

బి.కొత్తకోట : ఎదురుగా వస్తున్న కారును ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురు గాయపడిన సంఘటన శుక్రవారం మండలంలోని అమరనారాయణపురం వద్ద జరిగింది. స్థానికుల కథనం మేరకు.. కురబలకోట మండలం అంగళ్లు నుంచి దొమ్మనబావికి చెందిన ఆటో డ్రైవర్ నరసింహులు 26) కాండ్లమడుగుకు వస్తున్నాడు. ఆటోలో పెద్దమండ్యం మండలం సిద్దవరానికి చెందిన మంజునాథ్ (30), జార్ఖండ్‌కు చెందిన అబ్దుల్(19), సాజిద్(19), షాహిద్(19), జెస్సీన్(20) ఆటోలో వస్తున్నారు. అమరనారాయణపురం వద్దకు రాగానే ములకలచెరువు నుంచి మదనపల్లె వెళ్తున్న కారు... ఆటో ఢీకొన్నాయి. ఈ ఘటనలో అందరికీ తీవ్ర గాయాలవగా అబ్దుల్, జెస్సీన్‌లకు కాలు విరిగింది. బాధితులను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ప్రమాద ఘటనపై వివరాలు సేకరిస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప అగ్రికల్చర్ : ఏపీ పశుసంవర్ధ శాఖ ఆధ్వర్యంలో ఊటకూరు కోళ్ల ఫారంలో మూడు ప్రధాన యూనిట్ల అభివృద్ధికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శారదమ్మ తెలిపారు. పబ్లిక్, ప్రైవేటు వ్యక్తుల భాగస్వామ్యంతో చేపట్టనున్న ఈ యూనిట్లకు ప్రభుత్వ మౌలిక వసతులను వాడుకునే అవకాశాన్ని ఇస్తామన్నారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు

- ప్రత్యర్థులను వేధించడమే పనిగా కూటమి పాలన
- పెద్దిరెడ్డి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని తప్పుడు కేసులు
- మదనపల్లె ఫైల్స్ ఘటనలో ప్రమేయం లేదని చెప్పినా ఆగని వేధింపులు


విలేకరులతో మాట్లాడుతున్న దేశాయ్‌తిప్పారెడ్డి, నిసార్‌అహ్మద్, బి.నరేష్‌కుమార్‌రెడ్డి, తదితరులు

మదనపల్లె : ఆంధ్ర ప్రదేశ్‌లో రెడ్ బుక్ రాజ్యాంగం అమలుచేస్తున్నారని, ప్రజాస్వామ్య బద్ధంగా కాకుండా ప్రత్యర్థులను వేధించడమే పనిగా కూటమి పాలన సాగుతోందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. మదనపల్లెలోని ఎంపీ మిథున్‌రెడ్డి కార్యాలయంలో విలేకరులతో దేశాయితిప్పారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లి ప్రజల బాగోగులు చూడాలని కూటమి ప్రభుత్వానికి ప్రజలు పట్టం కడితే, ప్రత్యర్థులను వేధించడమే పనిగా పాలన సాగిస్తున్నారన్నారు. మదనపల్లె ఫైల్స్ కేసులో ఏ1 ముద్దాయిగా ఉన్న గౌతమ్‌తేజ్ లై డిటెక్టర్ నివేదికలో తనమీద ఎలాంటి ఒత్తిడి లేదని, ఘటనలో తన ప్రమేయం లేదని స్పష్టంగా పేర్కొన్నా, తనను ఎవరూ ప్రభావితం చేయలేదని చెప్పినప్పటికీ.. ప్రభుత్వం కక్ష కట్టి వేధిస్తోందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అంగళ్లు కేసును తప్పుడు ఎఫ్ఐఆర్ అని ఏ విధంగా కొట్టివేసిందో, ఇందులో ఎఫ్ఐఆర్ ఎవరు రాశారో? ఎందుకు కొట్టేస్తున్నారో? అర్థం కాని పరిస్థితి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం నమోదు చేసిన మద్యం, మదనపల్లె ఫైల్స్ కేసుల్లో కానీ, పెద్దిరెడ్డి, ఎంపీ కుటుంబంపై మోపుతున్న అభాండాలు, అభియోగాలకు ఆధారాలు చూపండంటూ సాక్షాత్తూ ఎంపీ ప్రశ్నిస్తున్నప్పటికీ చూపలేకపోయారన్నారు. ఎల్లో మీడియాలో కథనాలు రావడం, వాటి ఆధారంగా దర్యాప్తు అధికారులు కేసులు నమోదు చేయడం, వేధింపులకు పాల్పడడం జరుగుతోందన్నారు. మదనపల్లె వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ...పెద్దిరెడ్డి కుటుంబానికి ప్రజల్లో ఉన్న ఆదరాభిమానాలను చూసి తట్టుకోలేక, వారి వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీయాలనే లక్ష్యంతో తప్పుడు కేసులను తెరపైకి తీసుకొస్తున్నారన్నారు. మదనపల్లె ఫైల్స్ కేసులో ఎవరికి, ఎలాంటి ప్రమేయం లేనప్పటికీ, హెలికాప్టర్‌లో ఉన్నతాధికారులను పంపించి, డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారన్నారు. మద్యం కేసులో ఎంపీ మిథున్‌రెడ్డిని చేర్చడం, ఫారెస్ట్ భూములు ఆక్రమించారంటూ మాజీ మంత్రి పెద్దిరెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేడయం చేస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ...మదనపల్లె ఫైల్స్ కేసు విషయంలో నిష్పక్షపాతంగా సమగ్ర దర్యాప్తుచేసి కారకులపై చర్యలు తీసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నాయకులపై నమోదుచేయిస్తున్న కేసులన్నీ దురుద్దేశంతో కొందరిని లక్ష్యంగా చేసుకుని పెడుతున్నవేనని ప్రజలందరికీ అర్థమవుతోందన్నారు. కార్యక్రమంలో ఏపీఎండీసీ మాజీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో 8 మందికి గాయాలు


తీవ్రంగా గాయపడిన సాజిద్

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో ఎనిమిది మంది గాయపడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రామసముద్రం మండలం కాపల్లి పంచాయతీ నల్లచినేపల్లెకు చెందిన మునిస్వామిరాజు కుమారుడు శ్రీనివాసులురాజు (30) వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంలో పుంగనూరుకు వెళ్తున్నారు. మార్గమధ్యంలో చెంబకూరు– ఈడిగపల్లె రోడ్డులో ఈడిగ పల్లె వద్ద కత్తిరాజుపల్లెకు చెందిన చిన్నప్ప కుమారుడు ప్రకాష్ (27) ద్విచక్ర వాహనంలో వెళ్తూ, ఎదురెదురుగా ఢీకొన్నారు. ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలవగా స్థానికులు బాధితులను మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కురబలకోట మండలం దమ్మున్న బావి సమీపంలో, కోళ్ల ఫారాల నిర్మాణ పనులు చేస్తున్న జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన కూలీలు సాహిద్(20), జెస్సిం (20), సాజిద్ (21), అబ్దుల్లా(19), అంగళ్లకు వచ్చి మసీదులో ప్రార్థనలు ముగించుకుని తిరిగి దోమల బావికి వెళ్లేందుకు ఆటో ఎక్కారు. దమ్మున్న బావి సమీపంలో ఆటో మలుపు తిరుగుతుండగా ఎదురుగా వచ్చిన క్వాలిస్ వాహనం ఆటోను ఢీకొంది. ప్రమాదంలో నలుగురు కూలీలతోపాటు, ఆటో డ్రైవర్ నరసింహులు(19), అతడి స్నేహితుడు మంజునాథ్ గాయపడ్డారు. స్థానికులు బాధితులను మాలపిల్ల ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్సలు పొందకుండానే ఆటో డ్రైవర్ నరసింహులు అతని స్నేహితులు మంజునాథ్ ఆసుపత్రి నుంచి వెళ్లిపోయారు.

పార్కు స్థలం పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్

ఓబులవారిపల్లె : మండలంలో నూతనంగా నిర్మించే గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే రోడ్డు సమీపంలో పార్కు ఏర్పాటు చేసేందుకు అవసరమైన స్థలాన్ని పరిశీలించేందుకు వచ్చినట్లు జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ తెలిపారు. బాలిరెడ్డిపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్– 1155లో 20 ఎకరాల స్థలాన్ని పార్కు కొరకు పరిశీలించామని తెలిపారు. తహసీల్దారు శ్రీధర్‌రావు, ఆర్ఐ రామ్మోహన్ నాయుడు, సర్వేయర్ నాగలక్ష్మి, విఆర్ఓ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏపై కర్రతో దాడి


తీవ్రంగా గాయపడ్డ పెంచలయ్య

ఓబులవారిపల్లె : పాత కక్షలతో వీఆర్‌ఏ పెంచలయ్యపై అదే గ్రామానికి చెందిన కె.మణి కర్రతో తలపై కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. గ్రామంలో కె.మణి, వీఆర్‌ఏ పెంచలయ్య మధ్య భూ వివాదం ఉంది. శుక్రవారం రీ సర్వే జరుగుతోంది. పెంచలయ్య తన పని ముగించుకుని ఇంటికి భోజనానికి వచ్చారు. ఆ సమయంలో ఇంటి వద్ద ఘర్షణ జరుగుతోంది. వీఆర్‌ఏ పెంచలయ్య ఏం జరిగిందని మణిని అడిగారు. అప్పటికే ఇరువురి మధ్య భూ వివాదం ఉండడంతో పాత కక్షతో పెంచలయ్య తలపై మణి కర్రతో బాదాడు. పెంచలయ్యకు తీవ్రగాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెంచలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ పి.మహేష్ తెలిపారు.

ఎనిమిది మంది స్మగ్లర్లు అరెస్టు

12 ఎర్రచందనం దుంగలు, ఒక మోటారు సైకిల్ స్వాధీనం


టాస్క్‌ఫోర్స్ అధికారుల అదుపులో నిందితులు

వీరబల్లి : వీరబల్లి అటవీ పరిధిలో ఎనిమిది మంది ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి వారి నుంచి 12 ఎర్రచందనం దుంగలతో పాటు ఒక మోటారు సైకిల్‌ను శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎర్రచందనం అక్రమ రవాణ నిరోధక టాస్క్ ఫోర్స్ (ఆర్ఎస్ఏఎస్టీఎఫ్) ఆర్ఐ సాయి గిరిధర్, ఆర్ఎస్ఐ విశ్వనాథ్ బృందం స్థానిక ఎస్‌బీటీ అనీల్‌కుమార్‌తో కలిసి అన్నమ్మయ్య జిల్లా వీరబల్లి అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. శుక్రవారం ఉదయం క్వారీ పాయింట్ వద్ద కొందరు వ్యక్తులు మోటారు సైకిల్‌తో కనిపించారు. వీరిని చూసి పారిపోవడానికి ప్రయత్నించగా అప్రమత్తమై చుట్టుముట్టి పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. చుట్టు ప్రక్కల దాచిన 12 ఎర్రచందనం దుంగలు, మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారు తమిళనాడుకు చెందిన వారుగా గుర్తించామన్నారు. వారిని తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించగా వారిని డీఎస్పీలు శ్రీనివాసులు రెడ్డి, షరీఫ్‌లు విచారించారు. ఈ మేరకు ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లీగల్ ఎయిడ్ డిఫెన్స్ క్లీనిక్‌పై అవగాహన


మరుగుదొడ్లు పరిశీలిస్తున్న న్యాయమూర్తి ఎస్.బాబాఫక్రుద్దీన్

రాయచోటి టౌన్ : లీగల్ ఎయిడ్స్ డిఫెన్స్ క్లీనిక్‌పై జైలులో నిందితులు, ఖైదీలకు అవగాహన ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ అన్నారు. రాయచోటి సబ్ జైలును శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్‌పై వివరించారు. ఎలాంటి కేసుల్లో ఇక్కడికి వచ్చారు? మీ ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది? అంటూ ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలుంటే రాయచోటి మండల శాఖ న్యాయ సేవాధికార సంస్థ(కడప)ను సంప్రదించవచ్చునని చెప్పారు. అంతకుముందు జైల్లో వసతులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి అడిషనల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ ఎస్.తేజశ్విని, రాయచోటి సబ్ జైల్ ఇన్‌చార్జి సూపరిటెండెంట్, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జలాలతో చెరువులు నింపండి


మాట్లాడుతున్న నరసింహులు

బి.కొత్తకోట : హంద్రీ–నీవా ప్రాజెక్టు కాలువ నుంచి జిల్లాలోని చెరువులకు కృష్ణా జలాలు తరలించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్.నరసింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు. నిరుద్యోగ భృతి, 50 ఏళ్లకే పింఛన్, కొత్త రేషన్ కార్డులు, ఇంటి స్థలాలు, పక్కా గృహాలకు రూ.4 లక్షల మంజూరు హామీలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తామని చెప్పి ఇవ్వలేదన్నారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి, బషీర్‌ఖాన్, రఘునాథ్, అష్రఫల్లి, తంబయ్యశెట్టి, మంజునాథ్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో ఉద్రిక్తత


జనం తరలిరావడంతో మూసివేసిన పోలీస్ స్టేషన్ గేట్లు

గుర్రంకొండ : గుర్రంకొండ ఇందిరమ్మ కాలనీలో ఇరువర్గాల మధ్య ఘర్షణతో ఉద్రిక్తత తలెత్తింది. ఇందిరమ్మ కాలనీకి చెందిన ఓ మహిళ కడప–బెంగుళూరు జాతీయ రహదారిపై టీ.దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తోంది. ఈ మహిళ తన భర్తతో సహజీవనం చేస్తోందని ఆరోపిస్తూ స్థానిక పెద్దపాళెం వీధికి చెందిన మరో మహిళ కొందరిని వెంటబెట్టుకుని వచ్చి నిలదీసింది. తనకు ఎలాంటి సంబంధం లేదని టీ దుకాణం నిర్వహించే మహిళ వాగ్వాదానికి దిగడంతో ఇరు వర్గాల వారు పెద్ద ఎత్తున గుమిగూడి ఘర్షణకు దిగారు. ఒక వర్గానికి చెందిన వారు టీ.దుకాణాన్ని ధ్వంసం చేశారు. మరోవర్గం రెచ్చిపోయి దాడులకు పాల్పడ్డారు. ఎస్ఐ మధురామచంద్రుడు చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టి కొందరిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ పెద్ద ఎత్తున జనం చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. చేసేదేమీల లేక పోలీసలు పోలీస్ స్టేషన్ గేట్లు మూసివేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడి ప్రాణం తీసిన స్విమ్మింగ్‌పూల్

- ట్రైనర్ లేకుండానే అనుమతులు
- ఎమ్మెల్యే ప్రారంభించారని నోరు మెదపని అధికారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : కడప నగర శివారులోని చలమారెడ్డిపల్లెలో ఈ నెల 24న స్విమ్మింగ్ పూల్‌లో ఈత నేర్చుకునేందుకు వెళ్లిన గంజికుంటకాలనీ బాలుడు(15) మృత్యువాత పడ్డాడు. ట్రైనర్ లేకుండానే ఈత కొట్టడంతో బాలుడు ఊపిరి వదిలాడని స్థానికులు తెలిపారు. ఈ స్విమ్మింగ్‌పూల్ కడపకు చెందిన ఓ టీడీపీ నాయకుడు ఎలాంటి నిబంధనలు, అనుమతులు లేకుండానే నిర్మించారు. రెవెన్యూ, కార్పొరేషన్ స్థాయిలో అనుమతులు లేకపోయినా, టీడీపీ నేత కావడంతో కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి ఆర్భాటంగా వచ్చి తన చేతులమీదుగా రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే స్వయంగా ప్రారంభించడంతో ఒకవైపు కార్పొరేషన్, మరోవైపు రెవెన్యూ అధికారులు నోరు మెదపలేదు. అయితే ఈత నేర్పించేందుకు నిష్ణాతులైన ట్రైనర్‌ను నియమించకపోవడంతోనే ఓ బాలుడు మృతిచెందారని భావిస్తున్నారు. మరో వైపు బాలుడి తండ్రి దు:ఖానికి అవధుల్లేవు. ఏడాది కిందట ఆయన సతీమణి మృతి చెందారు. ఇపుడు తనయుడు చనిపోయినా పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు, మీడియాకు వివరాలను తెలియజేసేందుకు కూడా మనస్కరించలేదు. బాలుడు ఈ ఏడాది 10వ తరగతి పరీక్షలు(సెంట్రల్ సిలబస్) రాశారు. భవిష్యత్తులో ప్రమాదాలు జరిగే అవకాశాలు లేకపోలేదు.

ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పట్టణంలోని అమ్మచెరువు మిట్ట ప్రాంతంలో నివాసమున్న అబ్దుల్లా భార్య సమీన(22), భర్త వేధింపులతో మనస్థాపం చెంది ఇంట్లోనే ఎలకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అబ్దుల్లా వృత్తిరీత్యా డ్రైవర్ కాగా, ఉపాధి నిమిత్తం పెళ్లి అయిన రెండు నెలలకే కువైట్‌కు వెళ్లాడు. ప్రతి రోజూ భార్యకు ఫోన్ చేసి నువ్వు చచ్చిపో అంటూ వేధించడంతో, మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అదేవిధంగా అదే ప్రాంతానికి చెందిన సయ్యద్ కుమారుడు అర్షద్ (35), కుటుంబ సమస్యలతో మనస్థాపం చెంది సూపర్ వాస్మాల్, ఎలకల మందు కలిపి తిని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ఆయా ఘటనల్లో గమనించిన కుటుంబ సభ్యులు బాధితులను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన


గంగమ్మకు పూజలు చేస్తున్న ఏఎస్పీ

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలో మే 1వ తేదీ నుంచి జరిగే జాతరలో అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని అన్నమయ్య జిల్లా ఏఎస్పీ మనోహరామ్‌నాథ్‌హెగ్డే సిబ్బందిని ఆదేశించారు. జాతర జరిగే ప్రాంతాలను శుక్రవారం ఆయన పరిశీలించి గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏఎస్పీ మాట్లాడుతూ వైభవంగా జరిగే జాతరలో ఎలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ హేమసుందర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

పుష్పగిరి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

వల్లూరు : పుణ్యక్షేత్రమైన పుష్పగిరిలో కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి, లక్ష్మీ చెన్నకేశవస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు శుక్రవారం అంకురార్పణ చేశారు. స్వామికి ఉదయం పుణ్యాహవాచనం, అఖండ దీపారాధన, రక్షా బంధన కార్యక్రమాలు జరిపారు. కొండపై లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో అర్చకులు అఖిల్‌దీక్షితులు స్వామిని అభిషేకించారు. రాత్రి విశ్వక్సేన పూజతో కార్యక్రమాలు ప్రారంభించారు. పుట్ట వద్దకు వెళ్లి పవిత్రమైన మట్టి తీసుకువచ్చి భూదేవిగా అలంకరించి మేదినీ పూజ జరిపారు. నవధాన్యాలతో అంకురార్పణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

రిమ్స్ ఓపీలోక్యాంటీన్ ప్రారంభం

కడప అర్బన్ : కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) ఓపీలో 24 రోజుల తరువాత క్యాంటీన్ గురువారం తిరిగి ప్రారంభించారు. క్యాంటీన్ తెరవ లేదని, ప్రజలు, వైద్యులు, సిబ్బంది ఇబ్బందిపడుతున్నారనీ ఇటీవల పత్రికలలో వార్తలు రావడంతో స్పందించిన ఆస్పత్రి అధికారులు క్యాంటీన్‌ను ఒకరికి అప్పగించారు. త్వరలో జరిగే ఆసుపత్రి అభివృద్ధి సలహా కమిటీ సమావేశంలో అక్కడ ఏ పద్ధతిలో ఇవ్వాలనేది తీర్మానించనున్నట్లు అధికారులు తెలియజేశారు.

ముగ్గురిపై కేసు నమోదు

ఒంటిమిట్ట : రాష్ట్ర వ్యాప్తంగా ఒంటిమిట్ట మండలంలో 15వ ఆర్థిక నిధులు దుర్వినియోగం చేసిన విషయం సంచలమైంది. కలెక్టర్ ప్రత్యేక విచారణ కమిటీ వేసి కొందరు అధికారులను సస్పెండ్ చేశారు. అయితే ఈ నిధుల దుర్వినియోగానికి మూలకారకులైన ముగ్గురిపై శుక్రవారం ఒంటిమిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 15వ ఆర్థిక నిధులు దుర్వినియోగం చేశారని నిర్ధారణ అయినందున మూలకారణమైన ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ జి వరప్రసాదరావు, కంప్యూటర్ ఆపరేటర్ మొఘల్ ముసరత్ అలీబేగ్, ఫిట్టర్ జనార్దన్‌లపై అప్పటి ఇన్‌చార్జ్ ఎంపీడీఓ (ప్రస్తుతం ఈఓపిఆర్‌డీ) కెఆర్ఎం ప్రసాద్ ఫిర్యాదు చేయడంతో విచారించి శుక్రవారం కేసు నమోదు చేశారు.

నమ్మించి... రిమాండ్‌కు తరలించి

జమ్మలమడుగు : సమస్య ఉంటే మాట్లాడుదామంటూ రైతును స్టేషన్‌కు పిలిచిన ఎస్ఐ అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించిన సంఘటన ముడియం మండలంలో శుక్రవారం జరిగింది. పెద్దముడియం మండలం కల్వటాల, కొండ పాపాయపల్లె గ్రామాల్లో సేల్(ఎస్ఏఈఎల్) కంపెనీ ఇటీవల సోలార్ నిర్మాణం చేపట్టింది. వీటికి ప్రభుత్వ భూములతోపాటు, డీకేటీ పట్టాలు, పట్టా భూముల్లో రైతులకు సమాచారం ఇవ్వకుండానే కంపెనీ పనులు చేస్తూ వచ్చింది. కొండ కల్వటాలలోని సర్వే నంబర్ 307లో పొరంబోకు భూములను నిరుపేదలు డబ్బు ఖర్చుచేసి బోరు వేసి పంటలు సాగు చేస్తున్నారు. ఈ కోవకు చెందిన రైతు మధుసూదనరెడ్డికి కల్వటాలలో డికేటీ పట్టా ఉంది. తాను పొలం సాగుచేయడానికి మట్టి తోలి.. పెద్ద రాళ్లు తొలగించేందుకు రూ.2 లక్షలు ఖర్చు చేశారు. ఇదిలా ఉంటే సోలార్ కంపెనీ ఉన్నట్లుగా సమాచారం ఇవ్వకుండానే మధుసూదన్‌రెడ్డి బాగుచేసిన భూమిని చదును చేయడం ప్రారంభించింది. ఇదేమిటంటూ కంపెనీ ప్రతినిధులను ప్రశించారు. ప్రతాప్‌రెడ్డి అనే వ్యక్తి ఫోన్‌లో మాట్లాడుతూ ‘ఆ భూమి సోలార్‌కు ఇచ్చింది.. అడ్డుతగలవద్దు’ అంటూ హెచ్చరించారు. తన భూమిలో మీ పెత్తనం ఏమిటంటూ రైతు ప్రతాప్ రెడ్డికి స్పష్టం చేశారు. ఆ తర్వాత కొంత సేపటికే ఎస్ఐ సుబ్బారావు ఫోన్ చేసి రైతుతో మాట్లాడారు. సోలార్ యాజమాన్యం తప్పుడు కేసు నమోదుచేయడం, వెంటనే ఎస్ఐ సుబ్బారావు స్టేషన్‌కు పిలిపించి అరెస్టు చేయడం జరిగిపోయింది. మాట్లాడకుండానే రిమాండ్‌కు పంపడం చూసి ఆ రైతు అవ్వాక్కయ్యాడు.

టీచర్ల సర్టిఫికెట్లలో వైకల్యం..!

- మూడు రోజుల పరిశీలనలో ‘గోల్‌మాల్’
- డాక్టర్ల క్లినిక్‌లకు వెళ్లి కొందరి బేరసారాలు
- ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.30 వేల వరకు వసూళ్లు
- తొలి రోజున నగదు రూపంలో ఫీజుల వసూలు
- అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రమే


సర్టిఫికెట్ పరీక్షలకు వచ్చిన ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది బదిలీల కోసం ఏకంగా చట్టం చేశారు. ఈ విషయంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక చట్టాన్ని తీసుకువచ్చారు. దానికనుగుణంగా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ప్రతి జిల్లాలో ఈ నెల 24వ తేదీ నుంచి 26వతేదీ వరకు మూడు రోజుల పాటు బోధన, బోధనేతర సిబ్బందికి చెవుడు, మూగ, కుంటి, గుడ్డి, అంగ వికలత్వం, బుద్ధి మాంద్యం, క్యాన్సర్, మూత్రపిండాల వ్యాధి, గుండె జబ్బు, ఇలా వ్యాధులు కలిగిన సిబ్బంది లేదా వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యుల వివరాలు పునఃపరిశీలించాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయా విభాగాల్లో నిష్ణాతులైన డాక్టర్లచే రిమ్స్ జనరల్ హాస్పిటల్‌తో వికలత్వ, వ్యాధి నిర్ధారణ పునఃపరీక్షలు రిమ్స్ సూపరిండెంట్ పర్యవేక్షణలో జరుగుతున్నాయి. వివిధ విభాగాలు డాక్టర్లు, అధికారులను, సిబ్బందిని ఇందుకోసం నియమించారు. ఇంతవరకూ బాగానే ఉన్నా ఈ నెల 24న జరిగిన పరిశీలనలో చేయి తడపనిదే కొందరు సర్టిఫికెట్లు జారీ చేసేందుకు ముందుకు రాలేదనే విమర్శలున్నాయి. రిమ్స్ సిబ్బంది చేతివాటం ప్రదర్శించి కొందరు డాక్టర్లు, ఆటు టీచర్లను మేనేజ్ చేశారనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. డబ్బులిచ్చిన వారికి కోరుకున్నట్లు సర్టిఫికెట్లు జారీ చేసేశారు. కొందరు యూనియన్ లీడర్లు, మండల విద్యాధికారులతో రెండు రోజుల ముందుగానే సిబ్బంది టచ్‌లోకి వచ్చి సర్టిఫికెట్ల జారీపై చెప్పినట్లు సమాచారం.

ఒక్కో రేటుతో వసూళ్లు

వికలత్వానికి ఒక రేటు, వ్యాధులకు మరో రేటు నిర్ధారించి వసూలు చేసినట్లు సమాచారం. ఆఫీసులో పని చేసే పెద్దస్థాయి అధికారి, సంబంధిత సెక్షన్ అధికారులచ, సిబ్బంది ఉపాధ్యాయుల యూనియన్ లీడర్లు, మండల అధికారులతోనూ లాలూచీ పడినట్లు సమాచారం. రిమ్స్ పరిపాలనా విభాగంలో పనిచేసేఆఫీస్ సిబ్బందిలో కొందరు ఈ వ్యవహారాన్ని సాగించారు. ఉపాధ్యాయుల స్థాయిని బట్టి రేటు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ అక్రమాలకు తెరతీసిన పరిపాలనా సిబ్బంది పారదర్శకంగా వికలత్వ సర్టిఫికెట్ల పరిశీలన చేయాల్సిన అవసరం ఉంది. బోగస్ వికలత్వ సర్టిఫికెట్లు బోగస్ వ్యాధుల పేరున సర్టిఫికెట్ల ధృవీకరణ లేకుండా అధికారులు డాక్టర్లు వ్యవహరించాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. ఉపాధ్యాయుడు, వారి కుటుంబ సభ్యులచే రిమ్స్ హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ పేరిట నిర్ధారణ పరీక్ష ఫీజు రూ.1000 చెల్లించాలని నిబంధన ఉండగా, ఈ డబ్బు బ్యాంకులో చెల్లించి రసీదు తీసుకువచ్చి వికలత్వ సర్టిఫికెట్‌కు జత చేసి, ఇస్తే డాక్టర్ పరిశీలించాల్సి వుంది. ఈ నిబంధనను తొలి రోజున తుంగలో తొక్కి డబ్బు తామే కట్టించుకున్నారు. కలెక్టర్, రిమ్స్ పరిపాలనాధికారులు ఇప్పటికైనా స్పందించి మిగిలిన రెండు రోజులైనా పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. తొలి రోజున 190 మందికి వికలత్వ పునఃపరీక్షలు నిర్వహించారు. రిమ్స్ అధికారుల సూచన మేరకు రెండు రోజుల వికలత్వ సర్టిఫికెట్ల నిర్ధారణ పరీక్షల ఫీజు యూనియన్ నాయకులే వసూలు చేసి ‘ఆసుపత్రి అభివృద్ధి కమిటీ’ ఖాతాలో ఎట్టకేలకు జమచేశారు.